విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

సీపీఐ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-గుంటూరు : సీపీఐ ఆధ్వర్యంలో అంధత్వ నివారణ సంస్థ సహకారంతో శంకర్ కంటి ఆసుపత్రి కాకాని వారి ద్వారా సుద్దపల్లి డొంక ప్రగతి నగర్‌లో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు విజయకుమార్, నూతలపాటి వెంకటేశ్వరరావు, చేపర్తి నాగేశ్వరరావు, యేసు, సైదా, అప్పమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ శంకర్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో గుంటూరు నగరంలో సుమారు 2000 పైన కంటి శుక్లం ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రగతి నగర్ లో పేదలు, మధ్యతరగతి వారి ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరికీ శుక్లం ఆపరేషన్లు చేసే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. పేదలైన వారికోసం సీపీఐ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో ఈ క్యాంపులు నిర్వహించడం జరిగిందని, అలాగే రాబోయే కాలంలో వివిధ డివిజన్‌లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. సీపీఐ ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై ఉద్యమాలే కాకుండా ప్రజలకు అవసరమైన సందర్భాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

రైతుల ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడికొండ : పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రుణ విముక్తి కల్పించాలని, విద్యుత్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న విజయవాడ నగరంలో జరుగు ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ కోరారు. మండల కేంద్రమైన తాడికొండలో కొనసాగుతున్న రైతు దీక్ష శిబిరాన్ని బుధవారం సందర్శించారు. రైతులకు సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని దేశ రాజధాని ఢిల్లీలో రైతులు ఏడాది పాటు పలు రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. రైతుల హామీలను అమలు చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ నేటికీ వాటిని అమలు చేయలేదని విమర్శించారు. రైతు ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు.

వ్యాపార సముదాయాల ఆకస్మిక తనిఖీ

- నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్వాధీనం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి లోని మంగళగిరిలో బుధవారం అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి ఆధ్వర్యంలో పలు వ్యాపార సముదాయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో 20 కిలోల నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నామని యజమానులకు రూ.14,500 జరిమానా విధించామని లక్ష్మీపతి తెలిపారు. 110 మైక్రాన్ల కన్నా ఎక్కువ ఉన్న క్యారీ బ్యాగులను మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు. సాధ్యమైనంత వరకు జూట్ బ్యాగులను మాత్రమే వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

క్రైస్తవ, ముస్లిం మతాలను స్వీకరించిన మాలమాదిగలను ఎస్సీలుగా గుర్తించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎస్సీలు ఏ మతం స్వీకరించినా వారిని ఎస్సీలుగానే గుర్తించాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజసుందరబాబు కోరారు. బుధవారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులు ముస్లింలు గత 50 సంవత్సరాల నుంచి చేస్తున్న పోరాటానికి వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం మతం మారితే రిజర్వేషన్లు కోల్పోతారంటూ సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను వేయడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని, కోట్లాది మంది దళిత క్రైస్తవ, ముస్లింలకు తీవ్ర నష్టం చేయడమేనని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 341, షెడ్యూల్డ్ కులాల జాబితా ఏర్పాటు గురించి ప్రస్తావించబడిందని, భారత రాష్ట్రపతి ఆమోదించిన పట్టికలో మాల మాదిగ కులాల వాటి ఉపకులాలు ఉన్నాయని ఆర్టికల్ 25 ప్రకారం దేశ పౌరులు తమకిష్టమైన మతాన్ని స్వీకరించవచ్చని, ఆచరించవచ్చని, ప్రచారం చేసుకోవచ్చని ఉందన్నారు. దళిత క్రైస్తవ ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నిరంకుశ రాజ్యాంగ వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా గుంటూరు లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఏసీ కళాశాల హాస్టల్ ఉల్ఫ్ హాల్ గ్రౌండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం క్రైస్తవ, ముస్లిం మత వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు చేసేందుకు దళిత క్రైస్తవ, ముస్లింలు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అస్మిత, మహిళా మండలి అధ్యక్షురాలు వేముల భారతి, సాల్మన్, ప్రేమ్ కుమారి పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇప్పించాలని వినతి

విశాలాంధ్ర-గుంటూరు: డొంక రోడ్డు విస్తరణలో నష్టపోతున్న గృహాల వారికి నష్టపరిహారం ఇప్పించాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడుకు బుధవారం ఆయన ఛాంబర్‌నందు గృహ నివాసితులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో నష్టపోతున్న గృహాల వారికి నగర పాలక సంస్థ తగిన పరిహారం అందిస్తామని, ఎంతో మందికి ఉపయోగకరమైన రోడ్డు విస్తరణకు సహకరించాలని మేయర్ తెలిపారు. రోడ్డు విస్తరణ ద్వారా స్థానిక ప్రజలకు కొంత మేర ఇబ్బంది కలిగినప్పటికీ విస్తరణ అనంతరం మెరుగైన మౌలిక వసతులు అందుతాయన్నారు. అలాగే విస్తరణలో ప్రభావితమయ్యే భవనాలకు తగిన నష్టపరిహారం అందించేలా అధికారులను పరిశీలించమని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మల్లెబోయిన శ్రీవల్లి, టౌన్ ప్లానింగ్ ఏ.సి.పి అజయ్ కుమార్, డొంక రోడ్డు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శనివారం హౌసింగ్ డే పాటించాలి

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్

విశాలాంధ్ర-గుంటూరు: జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రతి శనివారం హౌసింగ్ డే పాటించి సంబంధిత శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు లే అవుట్ లలో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకర్ హాలులో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ నిర్మాణాలు, పీఎంఏవై గ్రామీణ ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ, ఎంపీడీవోలు, హౌసింగ్, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పేదలందరికీ ఇళ్ళ పథకంలో 69,312 ఇళ్ళు మంజూరు అయ్యాయని, 64,975 ఇళ్ళు రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, 63,745 ఇళ్ళు గ్రౌండింగ్ చేయటం జరిగిందన్నారు. వీటిలో బిలో బేస్మెంట్ లెవల్‌లో 43,041, బేస్మెంట్ లెవల్‌లో 13,372, రూఫ్ లెవల్‌లో 1,241, శ్లాబ్ పూర్తి అయినవి 2,149, నిర్మాణాలు పూర్తి అయినవి 3,942 ఇళ్ళు ఉన్నాయన్నారు. ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామీణ స్థాయి వరకు ఉన్న అధికారులు, ఉద్యోగులతో నిరంతరం సమీక్షించటం జరుగుతుందని, లే అవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలు పరిశీలించటంతో పాటు, ప్రతి బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబరు 21వ తేదీ నాటికి ప్రతి మండలంలో ఒక లే అవుట్ లోని నూరుశాతం ఇళ్ళు నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని స్పెషల్ సీఎస్ అజయ్ జైన్‌కు కలెక్టర్ వివరించారు. స్పెషల్ సీఎస్ మాట్లాడుతూ సచివాలయం వారీగా మంజూరైన ఇళ్ళను లబ్ధిదారులలో అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెల్ఫేర్, పంచాయితీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, సర్వేయర్, వీఆర్వో సహాయంతో చర్యలు తీసుకోవాలన్నారు. లే అవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా హౌసింగ్ అధికారులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత మండల, పట్టణ స్థాయి అధికారులతో నిరంతరం పర్యవేక్షించి, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నవరత్నాలు ప్రభుత్వ సలహాదారులు శామ్యూల్ మాట్లాడుతూ లక్ష్యాల మేరకు ఇళ్ళు నిర్మాణం జరిగేలా అధికారులందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం లే అవుట్‌ల వారీ ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ రాజకుమారి, కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, హౌసింగ్ సిఎండి శివ ప్రసాద్, హౌసింగ్ పీడీ వి.ఎస్.సాయినాథ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇస్తానని మోసం చేశారు

- బాదుడే బాదుడు కార్యక్రమంలో నారా లోకేష్

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి నియోజకవర్గం, తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలపై జగన్ ప్రభుత్వం వేసిన పన్నుల భారం గురించి లోకేష్ వివరించారు. ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్తల ఇంటికి వెళ్ళి నారా లోకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో గెలిస్తే కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఇళ్ళ పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి ఆర్కే మోసం చేశారని, ఇప్పుడు కనీసం మా ప్రాంతానికి రావడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ బిల్లు ఎక్కువొచ్చింది అనే కారణం చూపి పెన్షన్లు కట్ చేస్తున్నారంటూ వృద్ధులు బాధను వ్యక్తం చేశారు. నిజం చెప్పులు వేసుకునే లోపు అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వచ్చిందని అన్నారు. నేను గెలిస్తే ఏడాదిలో ఇళ్ళ పట్టాలు ఇస్తా అంటే నమ్మలేదు.. లోకేష్ గెలిస్తే ఇళ్లు కుల్చేస్తాడని ఆర్కే ప్రచారం చేస్తే నమ్మి మోసపోయారు. ఇళ్ళ పట్టాలు ఇస్తా అన్న ఆర్కే పత్తా లేడు... పైగా పేదల ఇళ్లు దారుణంగా కూల్చేసి రాక్షస ఆనందం పొందుతున్నారు. నేను ఓడిపోయినా 12 రకాల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నానని అన్నారు. ఈ బాదుడే బాదుడు కార్యక్రమంలో తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, పెనుమాక గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి దోలా కళ్యాణ్, తాడేపల్లి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణ వందన, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతిబసు, గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖరరెడ్డి, పోతినేని శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి కిరణ్, వాణిజ్య విభాగం కార్యదర్శి గాదె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి భూసేకరణ పూర్తి చేయాలి



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలోని గుంటూరు-గుంతకల్లు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామంలో 2.30 ఎకరాలు భూ సేకరణ ప్రాజెక్ట్ పెండింగ్‌లో ఉందని, డిసెంబర్ 15 నాటికి భూసేకరణ పూర్తి చేసి రైల్వే శాఖకు ఆ స్థలాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ మానిటరింగ్ గ్రూప్ క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డిని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే పలు ప్రాజెక్టుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని జిల్లా కలెక్టర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళగిరి ఎయిమ్స్‌పై కలెక్టర్‌తో పాటు ఆర్అండ్‌బి, ఫారెస్ట్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా మాట్లాడుతూ మంగళగిరి ఎయిమ్స్‌లో అందిస్తున్న సేవలు గురించి, ఆస్పత్రి నిర్వహణ కొరకు కావలసిన నీటి వసతి సౌకర్యం కల్పించే పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళగిరి ప్రధాన రహదారి నుండి ఎయిమ్స్‌కు వెళ్ళే అప్రోచ్ రోడ్ నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, డీఆర్వోలు చంద్ర శేఖర రావు, వినాయకం పాల్గొన్నారు.

లోపానికి కారణమైన జన్యువులను కనుగొన్నాం

- విజ్ఞాన్స్ యూనివర్సిటీ రీసెర్చ్ అడ్వైజర్ ప్రొఫెసర్ పీబీ కవికిషోర్



విశాలాంధ్ర-గుంటూరు : మానవాళి లోని విటమిన్-కే లోపానికి కారణమైన జన్యువులను మొట్టమొదటసారిగా కనుగొన్నామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ రీసెర్చ్ అడ్వైజర్ ప్రొఫెసర్ పీబీ కవికిషోర్ తెలిపారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థి షాలిని రాజగోపాల్, కేరళలోని కొల్లాం అమృత విశ్వ విద్యాపీఠం అధ్యాపకుడు డాక్టర్ ప్రశాంత్ సురవార్జుల, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్టీ-సెర్బ్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించిన పరిశోధనలో విటమిన్-కే లోపానికి కారణమైన జన్యువులను కనుగొన్నారు. ఇప్పటివరకు విటమిన్-కే లోపానికి కారణమైన జన్యువులను ఎవరూ గుర్తించలేదని.... వివిధ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో మొట్టమొదటసారిగా కనుగొన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీబీ కవికిషోర్ మాట్లాడుతూ 'డిసెక్టింగ్ విటమిన్-కే పాత్‌వేస్ ఇన్ హ్యూమన్ యూజింగ్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ అనాలిసిస్' అనే అంశంపై పరిశోధన చేశామన్నారు. విటమిన్-కే లోపానికి కారణమైన జన్యువులను గుర్తించడానికి గడిచిన 2 సంవత్సరాలలో దాదాపు 5 రాష్ట్రాల నుంచి సేకరించిన సాంపిల్స్‌ను పరిశీలించామన్నారు. విటమిన్-కే లోపానికి కారణమైన జన్యువులను డయాగ్నసిస్ చేసే ప్యానెల్‌ను ఇండస్ట్రీల సహాయంతో తయారుచేస్తున్నామన్నారు. ఈ ప్యానెల్‌ను ప్రజలకు వీలైనంత త్వరలో అతి తక్కువ ఖర్చుతో అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్యానెల్ అందుబాటులోకి వచ్చినట్లయితే విటమిన్-కే లోపం కలిగిన ప్రజలను సులభంగా గుర్తించవచ్చునని తెలియజేసారు. విటమిన్-కే లోపం వలన అల్జీమర్స్, మతిమరుపు, మూత్ర విసర్జన, రక్తం గడ్డకట్టక పోవడం వంటి జబ్బులతో పాటు అనేక రకాలైన వ్యాధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధన విద్యార్థి షాలిని రాజగోపాల్ పాల్గొన్నారు.

వేములూరిపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండలంలోని వేములూరి పాడు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమా నికి తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పాల్గొని గడప గడపకు తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి వైకాపా నాయకలతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్పుల శివరామిరెడ్డి, గఫార్, జేమ్స్, అంజిరెడ్డి, సర్పంచ్‌లు కొరివి చిన్నా, ఆనంద్, మేడా బాబు, మెల్కియా, ఎంపిటిసిలు అమర్లపూడి అనురాధ, రత్నం, సకిలా లక్ష్మీ, గాంధిబుడె, స్వర్ణ చిన్నప్ప, జొన్నలగడ్డ ఆనంద్, గొట్టిపాటి వెంకటేష్, పిచ్చిరెడ్డి, ఎంపిడివో దాసరి అనురాధ, తహశీల్దార్ పద్మనాభుడు, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26న రైతు ధర్నాను జయప్రదం చేయండి

- రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు : రైతు సమస్యలపై ఈ నెల 26వ తేదిన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద రాష్ట్రంలోని అన్ని రైతు సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీలు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా 540 రైతు సంఘాలు సంవత్సరానికి పైగా 750 మంది రైతులు ప్రాణత్యాగం చేసి కేంద్రం తెచ్చిన నల్లచట్టాలపై పోరాటం చేసిన ఫలితంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి క్షమాపణలు చెప్పి ఆ నల్లచట్టాలను వెనక్కి తీసుకోవడం విధితమేనన్నారు. ఈ సందర్భంగా ప్రధాని అన్ని పంటలు మద్దతు ధర, భీమా సౌకర్యాలు, మరణించిన రైతులకు పరిహారం, స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు అమలు, వ్యవసాయ మంత్రి కుమారుని కారు దౌర్జన్యంపై కమిటీ వేసి నిందుతులను శిక్షించడం తదితర ఇచ్చిన హామీలను అమలుపరచకపోగా నల్లచట్టాలను దొడ్డిదారిన తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇది చాలదన్నట్లు వ్యవసాయ మీటర్లు పెట్టేందుకు సిద్ధం అవుతుందని, ఈ విధానాలపై జరిగే ధర్నాలో రాష్ట్రంలోని రైతాంగం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ ప్రధాన అజెండా



విశాలాంధ్ర-గుంటూరు : అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన అజెండా అని శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా ఆయన పాలన కొనసాగుతుందని వివరించారు. ఈ మేరకు బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 28, 29 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, స్థానిక కార్పొరేటర్లు షేక్ రోషన్, వెంకట రెడ్డితో కలిసి అప్పిరెడ్డి శంకుస్థాపన స్థాపన చేశారు. 28వ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ 4వ లైన్‌లో సైడ్ కాలువలు, 5వ లైన్‌లో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు, అలాగే 29వ డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ 3వ లైన్, భావానీపురం జీరో లైన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, శ్రీరామ్ నగర్‌లో కల్వర్టులు, సైడు డ్రైన్లను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. దశలవారీగా అభివృద్ధి చేసి గుంటూరు దిశాదశ మార్చటమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో అభివృద్ధి అటకెక్కిందని ఆరోపించారు. వైఎస్ జగన్ సీఎం అయిన నాటి నుంచి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు గులాం రసూల్, పరిసపోగు శ్రీనివాసరావు, కార్పొరేషన్ డీఈ రమేష్ బాబు, ఏఈ నాగవేణి, రామిరెడ్డి, సాధు రమేష్, ఖాన్, వెంకటేశ్వర్లు, బాబు, జూట్ మిల్ రెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పదవులు బాధ్యతలను పెంచుతాయి

విశాలాంధ్ర-గుంటూరు : పదవులు అలంకార ప్రాయం కాదని, భాధ్యతను మరింత పెంచుతాయని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా అన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షునిగా ప్రత్తిపాడు మండలం, గనికపూడి గ్రామానికి చెందిన షేక్ జానీ సాహెబ్ నియమితులు కావటంతో బుధవారం ఆయన ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో ఎమ్మెల్యే ముస్తఫాను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జానీ సాహెబ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ ఆస్తుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు (గ్రామము&మం) కాపురస్తులు **ఎనిమిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తం/డ్రి. కోటిరెడ్డి** గారి చేసిన సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయందేమనగా,

నా క్లయింటుకు చెందిన కొన్ని సంతకాలు గల 10 ప్రామిసరీ నోట్లు, అధారు కార్డు,పాన్ కార్డు వగైరాలతో పాటు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పెదగొట్టిపాడు బ్రాంచ్, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా, యొక్క సేవింగ్ **ఖాతా నెంబర్ : 3399611855**కు మంజూరు చేసిన చెక్కుబుక్‌లోని కొన్ని సంతకాలు కలిగిన ఖాళీ చెక్కులు అనగా **1) 008521, 2)008522, 3)008523, 4)008524, 5)008525, 6)008526, 7)008527, 8)008528, 9)008529 & 10) 0008530** గలవి కనిపించలేదు. కావున సదరు సంతకాలు కలిగిన ఖాళీ ప్రామిసరీ నోట్లు & చెక్కులు వగైరాలు ఎవరికైనా దొరికినా యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లుగాక సదరు ప్రామిసరీ నోట్లు మరియు చెక్కులను ఉపయోగించి ఎవరైనా ఏ విధమైన అక్రమ లబ్ధి పొందాలని ప్రయత్నం చేసిన ఎడల అట్టివారిపై నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

గోపిశెట్టి నాగేశ్వరరావు, అడ్వకేటు,
ఐ.పి.డి. కాలనీ 1వ లైను,
సంగడిగుంట, గుంటూరు.
సెల్: 6300129288

'గడప గడపకు మన ప్రభుత్వం'లో సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నగర పాలక సంస్థ పరిధిలోని 15వ సచివాలయం పాత మంగళగిరిలో భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఎమ్మెల్యే ఆర్కే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళగిరి పట్టణంలోని లూథరన్ చర్చి ప్రాంతంలో ఎమ్మెల్యే ఆర్కే పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం రూపొందించిన పథకాల గురించి వివరిస్తూ, ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. కాలనీవాసులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చిన కరెంటు పారిశుధ్యం, త్రాగునీరు, విద్యుత్ వంటి పలు సమస్యలను మున్సిపల్ అధికారులతో చర్చించి గంటల వ్యవధిలో అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే వెంట నగరపాలక సంస్థ, సచివాలయ అధికారులు, వలంటీర్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న జగన్

విశాలాంధ్ర-గుంటూరు : అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నాడని టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. ఇదేమిటని ప్రశ్నించినవారిపై దాడులు, అక్రమ కేసులు, అరెస్టులు చేసి వారిని హింసకు గురిచేస్తున్నారని విమర్శించారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జగన్ రెడ్డి పాలనలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమ విధివిధానాలపై బుధవారం తాడికొండ, పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాల క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల వలన ప్రజలు విసిగిపోయారని, ప్రభుత్వం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని వారికి అండగా ఉండటానికే 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజామాస్టారు, కంచర్ల శివరామయ్య, నార్నె శ్రీనివాస్, బండ్లమూడి బాబురావు, మల్లవరపు వెంకటరావు, నూతలపాటి రామారావు, షేక్ అబ్దుల్ గని పాల్గొన్నారు.

ప్రతీ ఏడాది సూపర్‌స్టార్ కృష్ణ స్మారక అవార్డు ప్రదానం

విశాలాంధ్ర-తెనాలి : సినీ రంగంలో విశిష్ట సేవలందించిన వ్యక్తికి ప్రతి ఏడాది సూపర్‌స్టార్ కృష్ణ స్మారక అవార్డును ప్రదానం చేస్తామని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24విభాగా యూనియన్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా ప్రకటించారు. తెనాలిలోని మా ఏపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజా బ్యాలెట్ ద్వారా ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డుకు ఎవరు ఎంపిక అయ్యారో జ్యూరీ ప్రకటిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్ర ప్రజలు తెల్ల కాగితంపై వారికి ఇష్టమైన సినీ నటుల పేర్లు మూడు పంపుకో వచ్చని ఆయన తెలిపారు. ముగ్గురి పేర్లతో తెలుగు రాష్ట్రాల ప్రజలు పూర్తి చేసిన బ్యాలెట్ పేపర్‌ను మా ఏపి కార్యాలయం, ఆలపాటి నగర్ సుల్తానా బాద్, తెనాలి 522202, గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ చిరునామాకు పోస్ట్ ద్వారా పంపవలసినదిగా ఆయన కోరారు. ప్రజా బ్యాలెట్‌లో ఆయా వ్యక్తుల పేరు, చిరునామా, ఫోన్ నెంబర్లు తప్పని సరిగా నమోదు చేయాలని దిలీప్ రాజా సూచించారు. మా కార్యాలాయనికి వచ్చిన ప్రజా బ్యాలెట్‌లో ఎక్కువ ఓట్లు వచ్చిన ముగ్గురిలో ఒకరికి సూపర్‌స్టార్ కృష్ణ స్మారక అవార్డుకు జ్యూరీ ఎంపిక చేస్తుందని ఆయన తెలిపారు. తెనాలికి చెందిన కృష్ణ జ్ఞాపకాలను మర్చిపోలేక ఈ మహోన్నత పురస్కారానికి శ్రీకారం చుట్టామని దిలీప్‌రాజా వివరించారు. మహేష్‌బాబుతో చర్చించిన అనంతరం ఎపుడు సూపర్‌స్టార్ కృష్ణ స్మారక అవార్డు పురస్కారం తెనాలిలో జరిగే తేదిని తెలియజేస్తామన్నారు. పారదర్శకత కోసం దీనికి సంబంధించిన విధి విధానాలపై జ్యూరీ ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తి చేసిందని ఆయన తెలిపారు.

'సీఎం జగన్ దేశానికే ఆదర్శం'

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్రంలో వంద సంవత్సరాల తరువాత వ్యవసాయ భూముల సర్వే చేపట్టి హద్దు రాళ్ళు వేయించి నేడు 2వేల గ్రామాలకు చెందిన 7,92,238మంది రైతులకు శ్రీకాకుళం జిల్లా నర్సన్న పేటలో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి దేశానికే ఆదర్శనం అని కోటి ఏడు లక్షల మంది రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్నారని దక్షిణ మధ్య రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ మాజీ సభ్యుడు ఎం.దశరధరామిరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన 1953 నుంచి 2019వరకు 17మంది ముఖ్యమంత్రులుగా పని చేశారని, ఇపుడు పాద యాత్రలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని మొత్తం 17,461 రెవెన్యూ గ్రామాలకు చెందిన 2.26కోట్ల వ్యవసాయ భూములను వెయ్యి కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసి 2.47కోట్ల రెవెన్యూ సర్వే నెంబర్లను రైతులకు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దేశ పరిపాలనలోనే ఇచ్చిన మాట నిలుపుకునే ఆదర్శనీయ ముఖ్యమంత్రి అని దశరధరామిరెడ్డి అభివర్ణించారు.

కాంగ్రెస్‌లోకి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

విశాలాంధ్ర-గుంటూరు : ది గుంటూరు బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షులు, న్యాయవాది లావు అంకమ్మ చౌదరి పీసీసీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజానాథ్, డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కొరివి వినయ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.సూర్య నాయక్, న్యాయవాది మంగళంపురి శ్రీనివాస్‌రావు, చుక్కా చంద్రపాల్, లీగల్ సెల్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
(గవర్నమెంట్ పార్టనేర్డ్ షెడ్యూల్డ్ బ్యాంక్)
27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్ పేట,
విజయవాడ-520002. ఫోన్ నెం.0866-2429080, 7729993171

బంగారు నగల వేలం నోటీసు

ఈ దిగువ పట్టికలో పేర్కొనబడిన వ్యక్తులు మా వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకొనియున్నారు. సదరు బాకీలు సకాలంలో చెల్లించనందున వాటి బకాయిలు పూర్తిగా చెల్లించి నగలు విడిపించుకొనవలసిందిగా మా వద్ద గల వారి చిరునామాలకు పలుమార్లు నోటీసులు పంపించినాము. సదరు బకాయిలు చెల్లించనందున **ది : 29.11.2022 (మంగళవారం) సాయంత్రం 04 : 00 గంటలకు మా బ్యాంకు (ప్రధాన కార్యాలయ)** ఆవరణలో మా వద్ద తాకట్టులో ఉన్న బంగారు ఆభరణములను వేలం వేసి బకాయిలను జమచేయబడును. ఇంకనూ ఏమైనా బాకీ మిగిలి ఉన్నయెడల చట్టరీత్యా బాకీదారుల నుండి వసూలు చేయబడును. ఆసక్తి ఉన్న వారు వేలములో పాల్గొనవచ్చును. వేలములో పాల్గొనువారు రూ.10 వేలు (E.M.D) ధరావత్తు సొమ్ము కట్టవలెను. ఎట్టి కారణము చూపకనే వేలమును నిలిపివేయుటకుగాని, వేలములో ఎక్కువ ధరకు పాడిన ధరను (Highest Bid) ఆఫరు తిరస్కరించుటకుగాని సర్వహక్కులు బ్యాంకు వారికి ఉన్నవి. వేలములో వస్తువులు పాడుకున్నవారు నగదు వెంటనే చెల్లించవలెను. మరింత సమాచారం కొరకు AGM (BRCC), APCOB వారిని సంప్రదించగలరు.

లోన్ ఖాతా నెం.	ఖాతాదారుని పేరు, చిరునామా	మొత్తము బరువు గ్రా.
కానూరు శాఖ		
110000220411	డి దుర్గారావు, డి.నెం.18-169/ఎ, మదీనా మసీదు, సనత్ నగర్, విజయవాడ-520007.	4.40
వేణుగోపాల నగర్ శాఖ		
110000356849	జి నవీన్ కుమార్, ఫ్లాట్ నెం.202, ప్రేమ్ రెసిడెన్సీ, 3వ లైను, వెంకటరమణ కాలనీ, గుంటూరు-522006	27.00

తేది : 24.11.2022
ప్రదేశం : విజయవాడ

సం/-
అసిస్టెంట్ జనరల్ మేనేజర్

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ముటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమునాలను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారా లేదా వంట గది వద్దకు వెళ్ళి వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆ సమయంలో ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ అహ్మద్ ఉన్నారు.

వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

విశాలాంధ్ర-దుర్గి : గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల అధ్యక్షుడుగా దుర్గి వీఆర్వో టి.కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఆరుముళ్ళ నాగేశ్వరరావు ప్రకటించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోల నూతన కార్యవర్గ సమావేశం ఎన్నికల అధికారి ఆరుముళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా ఎస్.కోటేశ్వర రావు (ఆత్మకూరు), కార్యదర్శిగా కె.రత్నప్రకాష (కోలగుట్ల), సంయుక్త కార్యదర్శిగా షేక్ జానీబాష(అడిగొప్పల), కోశాధికారిగా ఎం.సునీత (ముటుకూరు)లు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కడియం రాజు, ఆర్ఐ వాణి, సీనియర్ అసిస్టెంట్ నిర్మల, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వీఆర్వోలు రంగారావు, కిరణ్‌లు ఉన్నారు.

దీపాలతో భారీ శివలింగం

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో గల శ్రీ సమర్థ సద్గురు షిరిడి సాయిబాబా వారి మందిరం ఆవరణలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం 30 అడుగుల వెడల్పు 60 అడుగుల పొడవు శివలింగమను భక్తులచే 6000 ప్రమిదలతో ఒక్కొక్క ప్రమిదకు పది వేల వత్తులతో కట్టతో దీపములు మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడారు. ప్రముఖ ఆర్టిస్ట్ బి.ప్రసాద్ ఎంతో సమకోర్చి భారీ శివలింగం చిత్రీకరించిన ఆయనను ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు కమిటీ సభ్యులు శ్రమించి అద్భుతంగా రూపొందించారని అన్నారు.

పల్లె సంప్రదాయలకు ప్రతీక ఎడ్ల పోటీలు

విశాలాంధ్ర-కారంపూడి: పల్లె సాంప్రదాయాలకు ఎడ్ల పోటీలు ప్రతీకగా నిలుస్తాయని మాచర్ల శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పలనాటి వీరారాధన ఉత్సవాలలో మొదటిరోజైన రాచగావున జాతీయ ఎడ్ల బండలాగుడు పోటీలను శాసనసభ్యులు ప్రారంభించారు. తొలుత పట్టణంలోని వీర్ల అంకాళమ్మ, చెన్నకేశవస్వామి, వీరుల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోటీల ప్రాంగణం వద్ద కొబ్బరి కాయ కొట్టి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుదలకు

ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలి

కలెక్టర్ శివశంకర్

విశాలాంధ్ర-శావల్యాపురం: విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. మండలంలోని మతుకుమల్లి జడ్పీపాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల ముఖ ఆదారిత హాజరు, పాఠశాల రికార్డులు పరిశీలించి, విద్యార్థులతో కలసి కూర్చొని మద్యాహ్న భోజనాన్ని(జగనన్న గోరుముద్ద) పరిశీలించారు. కొందరు విద్యార్థులు కోడిగ్రుడ్డు తినకపోవడం గమనించిన కలెక్టర్ బాలికలు బలహీనంగా ఉన్నారని, పౌష్టికాహార లోపాలను అధిగమిస్తేనే అనారోగ్యం పాలు కాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మెను ఆధారంగా మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని నిర్వాహకులు తెలిపారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి విడుదలైన నిధులు, చేపడుతున్న పనులను హెచ్ఎంను అడిగి వివరాలను తెలుసుకొన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో కలసి తరగతి గదిలో కూర్చొని ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్ తదితర సబ్జెక్టులలో అనేక రకాల ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పక పోవడంతో కొంత అసంతృప్తిని కలెక్టర్ వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై బోధనాంశాలపై కొంతసేపు చర్చించారు. సర్పంచ్ యలగాల బసవయ్య, హెచ్ఎం శనగవరపు వెంకటేశ్వర్లు, పీఎంసీ చైర్మన్ తిరుమలశెట్టి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పారిశుధ్య కార్మికులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ నియోజక వర్గంలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికుల గ్రీన్ అంబాసిడర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం బుధవారం స్థానిక శివయ్య భవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ వినుకొండ నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతంలోని గ్రామపంచాయతీలలో పారిశుద్ధ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వక వారి కుటుంబాలు గడవక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఏదైతే ఒప్పందం ప్రకారం విధులలో చేర్చుకున్నారో, ఆ ఒప్పందాలన్ని నెరవేర్చాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అప్పరాజు పవన్ కుమార్, ఆర్. వందనం, పిన్నేబోయిన వెంకటేశ్వర్లు, కొప్పరపు మల్లికార్జునరావు, మల్లేశ్వరరావు, జాన్సన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేధాశక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ దోహదం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: విద్యార్థులలో మేధాశక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ దోహదం చేస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంకాళ్ళ శాంత భూలక్ష్మీ, పిసి చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసిరెడ్డి అన్నారు. పెదకూరపాడు మండలం పరిధిలో 75తాళ్లూరు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులచే బుధవారం పాఠశాల స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ, సాంబశివరావు, వెంకటరమణ, సుబ్బారావు, రామయ్య, భాస్కర్ రెడ్డి, సుగుణవతి పర్యవేక్షించారు. ఈ ప్రదర్శనలను స్థానిక జేబీ పాఠశాల విద్యార్థులు తిలకించారు.

జిల్లాలో పెండింగ్ కేసుల విచారణను పూర్తి చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్ : జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అక్టోబర్-2022 నెలకు సంబంధించి జిల్లా పోలీస్ అధికారులతో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగులో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, పోక్సో కేసుల విచారణ సమయంలో మహిళా పోలీస్ అధికారి తప్పనిసరిగా ఉండాలి. ఆ సమయంలో సదరు అధికారి యూనిఫార్మ్‌లో ఉండకూడదని ఎస్పీ అన్నారు. ఏదైనా కేసుల్లో జువైనల్స్(మైనర్ల)ను విచారించవలసివస్తే వారిని పోలీస్ స్టేషన్‌కు బయట మాత్రమే విచారించాలని, మహిళలను రాత్రి సమయాలలో పోలీస్ స్టేషన్లకు పిలిపించరాదని, ఒకవేళ వారిని విచారించవలసి వస్తే తప్పనిసరిగా విచారణ సమయంలో మహిళా ఎస్సై లేదా కానిస్టేబుల్ ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీలు జి.బిందుమాధవ్(అడ్మిన్), రామచంద్రరాజు (ఏఆర్)లు, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు విజయ భాస్కరరావు, విజయభాస్కర రెడ్డి, జయరాం ప్రసాద్, దిశా డీఎస్పీ రవిచంద్రలు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో మచ్చుకైనా కానరాని అభివృద్ధి

విశాలాంధ్ర-ఈపూరు : తెలుగుదేశం పార్టీ ఐదేళ్ల పాలనలో అవినీతిని చూసిందే తప్ప అభివృద్ధిని మచ్చుకైనా చూడలేదని వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ఇనిమెళ్ళ గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిస్తూ లబ్ధిదారులకు సంక్షేమ బుక్ లెట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసీపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ వద్ద పోలీసుల అత్యుత్సాహం

విశాలాంధ్ర- వినుకొండ: నరసాపురంలో సీఎం సభ వద్ద పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారని నల్ల దుస్తులు, నల్ల చున్నీలు వేసుకున్న వారిని అనుమతించకపోవడం సిగ్గుచేటని, మహిళలకు జరిగిన అవమానాన్ని ఖండిస్తున్నామని టీడీపీ మహిళా నాయకులు అన్నారు. ఉదయం వర్షం కురవడంతో నలుపు రంగు రైన్ కోట్లు వేసుకొచ్చిన వారిని అవి తీసి పక్కన పెట్టి లోపలికి వెళ్లాలని అక్కడ ఉన్నటువంటి అధికారులు ఆదేశించారు ఎప్పుడు చూడలేని సంస్కృతి వైసీపీ ప్రభుత్వంలో మహిళలు చూడాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు మన్నం ఆదిలక్ష్మి, వినుకొండ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ముప్పూరి చౌడమ్మ, వినుకొండ టౌన్ తెలుగు మహిళా అధ్యక్షురాలు బొట్లగుంట లక్ష్మీ ,మరియు ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాలు తుమ్మ వెంకట కోటమ్మ తమ్మిశెట్టి ఈశ్వరమ్మ గుమ్మడిదల శివ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: అర్హులైన వారందరికి బ్యాం కుల నుంచి రుణాలు ఇవ్వా లని గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ యూనియన్ బ్యాంక్ గుంటూరు బ్రహ్మానందకుమార్ అన్నారు. స్థానిక ఐసిడియస్ కార్యాలయంలో ఫిరంగిపురం, మేడి కొండూరు, గుంటూరు రూరల్ యూనియన్, యస్‌బిఐ బ్యాంకుల అధికారులతో జాయింట్ మండల లెవల్ బ్యాంకర్స్ కమిటీ మీటింగ్ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డైరెక్టర్ బ్రహ్మానందకుమార్ మాట్లాడుతూ అర్హులైన వారందరికి అనగా రైతులకు, డ్వాక్రా సంఘాలకు, నమ్మకమైన ఖాతాదారులందరికి రుణాలు మంజూరు చేసి వివిధ వృత్తులకు సంబంధించి ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా చర్యలు చేపట్టి బ్యాంకుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన పథకం క్రింద నమోదైన ఖాతాదారులు సంవత్సరానికి రు.436లు ప్రీమియం చెల్లించిన వారికి ఈ పథకంలో నమోదైన ఖాతాదారుడు మరణిస్తే రు.2లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ భీమా వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఫిరంగిపురం యూనియన్ బ్యాంక్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఇ.రాధిక, యస్‌బిఐ చీఫ్ మేనేజర్ సిహెచ్. ఆనందకుమార్, సిజిజిబి జిల్లా కో-ఆర్డినేటర్ యం. వెంకట సతీష్, ఫిరంగిపురం మండల వ్యవసాయాధికారి కె.రమణకుమార్, వివిధ బ్యాంకులకు చెందిన మేనేజరులు, సిబ్బంది పాల్గొన్నారు.

షాపులను తనిఖీ చేసిన తూనికలు కొలతలు శాఖా అధికారులు

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో గల షాపులను బుధవారం తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. తూనికలు కొలతల శాఖ ఇన్ స్పెక్టర్ ఎన్.అల్లూరయ్య ఆధ్వర్యంలో గ్రామంలో బేకరీ షాపులను, కిరాణా దుకాణాలను, హెూటళ్లను, తనిఖీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా తూనికలు కొలతలు శాఖ ఇన్ స్పెక్టర్ అల్లూరయ్య మాట్లాడుతూ షాపులలో వినియోగదారులకు సరుకులు ఇచ్చేటప్పుడు నిష్పక్షపాతంగా కాటా వేసి ఇవ్వాలని అన్నారు. షాపుల యజమానులు సరుకుల వినియోగానికి ఉపయోగించే కాటాకు ప్రభుత్వం నుండి లైసెన్స్ పొందాలని అన్నారు. షాపులలో ప్రభుత్వం వారి ముద్ర ఉన్న కాటాలను వినియోగించాలని అన్నారు. ఆ విధంగా కాటాలు లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూనికలు కొలతలు శాఖ సిబ్బంది, షాపు యాజమానులు పాల్గొన్నారు.

రాజమండ్రిలో మహాసభలు జయప్రదం చేయండి

- బత్తుల శ్యామ్యూల్

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 26 నుంచి రాజమండ్రిలో జరగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం 7వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ తెలిపారు. బాపట్లలోని ముఠా గోడౌన్ ఆఫీస్ వద్ద బుధవారం గోడ పత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 32 వేల పెండింగ్ క్లైయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని సంక్షేమ బోర్డు నుండి ప్రభుత్వం వాడుకొన్న 1200 కోట్లు తిరిగి సంక్షేమబోర్డుకు అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియ్జెకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షులు సన్నమూరి శ్రీనివాసరావు, కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, బాపట్ల సీపీఐ నాయకులు జెల్డి బాగ్య శ్రీధర్, ఏఐటీయూసీ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, పమిడి బోయిన రామాంజనేయులు తదితరులున్నారు.

27న రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ప్రముఖ సూపర్ స్పెషాలిటీ హార్ట్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం నందు అవగాహన సదస్సు జరుగుతుందని నిర్వాహకులు తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా 50 శాతం రాయితీతో కూడిన వైద్యం చేయుట, ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ వంటి అంశాలను వైద్య సిబ్బంది ప్రజలకు వివరిస్తారన్నారు. రమేష్ వైద్యశాలకు చెందిన ప్రముఖులైన వైద్య బృందం పాల్గొని గుండె సంబంధిత సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సమగ్రంగా వివరిస్తారు. భట్టిప్రోలు పరిసర గ్రామాల ప్రజలు వినియోగించు కోవాలని సాయిబాబా కోరారు.

వెల్లటూరులో గీతా జయంతి

వెల్లటూరు గీతాశ్రమంలో ప్రవచనం చేస్తున్న గీతా గురుజీ శ్రీశైలం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలంలోని వెల్లటూరులోని గీతాజ్ఞాన మందిరంలో గీతా జయంతి మహోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలో వేంచేసియున్న క్షకృష్ణుని విగ్రహానికి షోడశనామ పూజలు, అభిషేకాలను జరిగించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, భగవన్నామస్మరణల మధ్య గీతా జ్ఞాన కర్పూర యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. కార్తీక మాసం బహుళ అమావాస్య రోజున కౌరవులకు, పాండవులకు యుద్ధం జరిగిందని యుద్ధం ప్రారంభించే ముందుగా శ్రీకృష్ణ పరమాత్మ అర్జుననకు గీతాపదేశం చేసిన రోజున గీతా జయంతిని జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుందని గీతా గురూజీ పందిరి శ్రీశైలం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. దేవస్థానం ఆవరణలో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ ఉత్సవాలలో ఆశ్రమ నిర్వాహకురాలు వనజాక్షమ్మ, వంగర చలమయ్య సిద్దాంతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- నేర సమీక్షలో ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : మహిళలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా జిల్లాలో ఉన్న సముద్ర తీరాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించి ప్రాణాలు తెగించి ప్రాణాలు కాపాడిని సిబ్బందిని బందోబస్తు నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. జిల్లాలో చోరీ కేసుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయ్యాలన్నారు. సిసి కెమెరాల గురించి ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక సిసి కెమెరా 10 మంది పోలీసులతో సమానమని సిసి కెమెరాల సమాచారం ఆధారంగా కేసుల ఛేదన సులభతరం అవుతుందన్నారు. మహిళల పట్ల ఏదైనా నేరం జరిగిందని స్టేషన్‌కి పిర్యాదు వస్తే తక్షణం స్పందించి ఆ పిర్యాదుపై చర్యలు తీసుకోవాలని మహిళలు, మైనర్ల పట్ల జరిగే నేరాల విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై శాఖ పరమైన చర్యలకు ఉపేక్షించబోమని హెచ్చరించారు. దిశ కాల్స్, డైల్ 100 కాల్స్ వస్తే వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ తగాదాలు, స్థల వివాదాలు, ఒంటరిగా ఉంటున్న మహిళలు,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సమస్యల గురించి మహిళా పోలీస్ డ్యూటీ ట్రాకర్ గురించి స్టేషన్ ఎస్సైల పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు.ప్రతి వాయిదాకు ముద్దాయిలకు సాక్షులకు సమన్లు సర్వ్ చేసి వారు సక్రమంగా వాయిదాలకు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులో ట్రైల్ జరిగే కేసులలో వాయిదాలకు సాక్షులను సక్రమంగా హాజరు పరిచి వారు భయం లేకుండా నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా డిఎస్పి, సీఐ, ఎస్ఐలు తర్ఫీదు ఇవ్వాలన్నారు. నాటు సారా, అక్రమ మద్యం, పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పేకాట, కోడిపందాలు వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, తరచు దాడులు నిర్వహిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. గత నెల జిల్లాలో నేర నియంత్రణలో, మిస్సింగ్ కేసులు ట్రేస్ చెయ్యడంలో, మెగా లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయుటలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ , డిసిఆర్బి డిఎస్పి జి.లక్ష్మయ్య, బాపట్ల,చీరాల,రేపల్లే డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, పి. శ్రీకాంత్, టి. మురళీకృష్ణ, ఎస్పీ సీఐ ఎ. శ్రీనివాస్, సిసిఎస్ సీఐ ఎం.మురళి కృష్ణలు ఉన్నారు.

మహిళా ఉద్యోగుల భద్రతకు కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా పంచాయితీ నోడల్ అధికారికి వేధింపులు అనే వార్త విశాలాంధ్రలో మంగళవారం ప్రచురిత మైంది. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మహిళా ఉద్యోగినిల సమస్యల పరిష్కారం కొరకు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్. విజయమ్మ, వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయలక్ష్మి, జిల్లా మహిళా, శిశు అభివృద్ధి, సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఉమా ఉంటారన్నారు. తోటి ఉద్యోగులు వేధిస్తున్నారంటూ పంచాయితీ శాఖలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని వేదింపులపై స్పందించిన కలెక్టర్ మహిళా అధికారులతో కమిటీని నియమించి విచారించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలలో మహిళా ఉద్యోగినిలకు భద్రత కల్పించడం కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని డిఆర్ఓ లక్ష్మీశివజ్యోతి తెలిపారు. వేధింపులకు గురైన బాధిత మహిళా ఉద్యోగినులు న్యాయం చేస్తామన్నారు. వేధించే వారిపై కూడా చట్టపరమైన క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగినుల విధులకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారని ఆమె వివరించారు. బాధితురాలిని కమిటీ విచారించిన తదుపరి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. బుధవారం పంచాయితీ నోడల్ అధికారి రాజ్యలక్ష్మి బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో అమెను వేధింపులకు గురిచేస్తున్న వారిపై లిఖితపూర్వకంగా పిర్యాదు చేశారు.

భవనంవారిపాలెంలో 'పొలంబడి'

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండల పరిధిలోని భవనంవారిపాలెం గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వంలో డా.వై యస్ ఆర్ పొలంబడి రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోనిటరింగ్ ఆఫీసర్ గా విచ్చేసిన వ్యవసాయ ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ వరి కోతలు సమీపిస్తున్నందువల్ల ప్రతి రైతు కోతల వివరాలు గ్రామ వ్యవసాయ సహయకురాలికి అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎం.ఎ.ఓ సత్యానంద్, ఎ.ఇ.ఒ.లు సుదర్శన్,పావని, గ్రామ వ్యవసాయ సహాయకులు షాలెం, జాన్, ప్రసాద్, బ్రహ్మయ్య, దుర్గ, నాగేశ్వరి, దీప్తి, స్వాతి పొలంబడి రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చిత్ర కళా పోటీలు

విశాలాంధ్ర-శావల్యాపురం: విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించడానికి చిత్రలేఖన పోటీలు ఎంతగానో దోహత పడతాయని శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులిపాటి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రస్థాయి చిత్రకళా పోటీల గోడ ప్రతులను అన్ని జడ్పీ పాఠశాల హెచ్ఎంలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బెజవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ కే.కే. మిత్రమండలి సంయుక్తంగా జస్టిస్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో డిసెంబర్ 10వ తేదిన వినుకొండ నిర్మల గర్ల్స్ హైస్కూల్ నందు ఉభయ తెలుగు రాష్ట్రాలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన చిత్రకారుల చిత్రాలతో రాష్ట్రస్థాయి చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేయనున్నామని, చిత్రకళా రంగంలో అంతర్జాతీయ అవార్డులు సాధించిన దాకోజుశివప్రసాద్, సి.కోటేష్‌ల లైవ్ ఆర్ట్ డెమో నిర్వహింపబడునని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్రస్థాయి చిత్రకళా పోటీలు నిర్వహింపబడునని తెలిపారు. ఐదవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు జూనియర్ విభాగం గాను, ఎనిమిదవ తరగతి నుండి పదవ తరగతి వరకు సీనియర్ విభాగం గాను పరిగణింపబడును. నవంబర్ 30 లోపు 9848469694 గల నంబరుకు ఫోన్ పే ద్వారా రూ.50ల ఎంట్రీ ఫీజుతో స్వాతంత్ర సమరయోధుల బొమ్మలు ఏ4 తెల్ల కాగితం మీద గీసి కాగితం వెనుక వైపున పేరు, ఫోన్ నెంబరు అడ్రస్ వివరములు రాసి, సమర్పించవలెను. డిసెంబర్ 10వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఆర్ట్స్ ఎగ్జిబిషన్ జరిగే వేదికపై ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేయబడును. ఈ కార్యక్రమంలో కనిగిరి శ్రీనివాసరావు, వెంకటేశ్వర రావు, శంకర రంగారావు, వినుకొండ 19వార్డు మెంబర్ భాష, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అబ్దుల్లా, ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివరాలకు 9010709282, 9848469694 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ముస్లింలకు ద్రోహం చేసిన జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలను విస్మరించడంపై ముస్లిం మహిళలు టీడీపీలో చేరుతున్నారని బాపట్ల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ నరేంద్ర వర్మ రాజు, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా అబ్దుల్ ఫరక్‌లు తెలియజేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ నాయకులతో కలసి ఏర్పాటుచేసిన సమావేశంలో బాపట్ల ఇంచార్జ్ 8వ వార్డుకు చెందిన 20 మంది ముస్లిం మహిళలు టీడీపీ కండువా కప్పుకోవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ద్రోహం చేయడమే కాకుండా వారి శాశ్వతకాల సమస్యలు ఏమాత్రం పరిష్కరించకుండా చిన్నచూపు చూడడంపై సర్వత్ర విమర్శలు గుప్పిస్తున్నారన్నారని బాపట్ల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వేగేసేన నరేంద్ర వర్మ రాజు అన్నారు. అనంతరం ముస్లిం మహిళలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా అబ్దుల్ ఫరక్ మైనార్టీ సెల్ నాయకులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు చేస్తున్న అన్యాయాన్ని ఎదిరించి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ముస్లిం మైనార్టీలకు ఉన్నటువంటి సమస్య గాని ఇతర కార్పొరేషన్ నిధులు కానీ ఎక్కడ కూడా అందిన దాఖలాలు లేవని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే మైనారిటీల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని లేదంటే మైనార్టీల ఓటు విలువ ఏందో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫరూక్ అహ్మద్, అక్బర్, రహంతుల్లా, కరీం, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS NO : 158/2021

బిట్వీన్ :

కొండసాని అలేఖ్య - వాది

వర్సెస్,

గంగవరపు సుబ్బారెడ్డి - ప్రతివాది.

టు,

గంగవరపు సుబ్బారెడ్డి తండ్రి వెంకటేశ్వరరెడ్డి, హిందూ, వయస్సు 35సం, వ్యవసాయం, నివాసం పాలవాయి గ్రామం, రెంటచింతల మండలం, పల్నాడు జిల్లా.

పైన తెలిపిన నెంబర్ దాబాను వాది వద్ద రూ. 5,00,000/-లు, ది.01-10-2016న మీ కుటుంబ ఖర్చులకు గాను తీసుకొని దావా షెడ్యూలు దాఖలా ఆస్తిని తాకట్టు పెట్టి రూ.2/-లు వడ్డీ ఇచ్చు లాగున అంగీకారంతో ది.01-10-2016న, మాచర్ల సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో డాక్యుమెంట్ నెంబర్ 4480/2016 గా తాకట్టు దస్తావేజు రిజిస్టర్ చేసి ఉన్నావని సదరు బాకీ మొత్తమును వడ్డీతో సహా ది.30-09-2018 లోపు చెల్లించు లాగున అంగీకరించినను, వాదికి అనుకున్న ప్రకారం బాకీ చెల్లించనందున సదరుబాకిని రాబట్టుకొనుటకు తాకట్టు దస్తావేజు ఆధారంగా మీపై దావా వేసి శ్రీ కోర్టు వారు మీరు అనేక పర్యాయములు దావా సమన్లను పంపినను అందుబాటులో ఉండి కూడా తీసుకొని ఉండలేదు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది.8-12-2022 నాటికి వాయిదా వేసి ఉన్నారు. ఆరోజున మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని ఉదయం 10:30 గంటలకు హాజరై, మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలియజేసుకోగలరు. లేనియెడల మీ పరోక్షమందు దావాను పరిష్కరించబడును. కావున తెలియజేయడమైనది.

వాయిదా ది.08-12-2022.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

చిలమకూరి నాగిరెడ్డి,
అందుగుల బాలకోటి
వాది తరపు న్యాయవాదులు.

ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించిన కోవెలమూడి

విశాలాంధ్ర-గుంటూరు: స్థానిక 25 డివిజన్ టీడీపీ అధ్యక్షులు గాలం వెంకటేశ్వ రావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటర్ల నమోదు శిబిరాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర బుధవారం సందర్శించి, నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం శిబిరం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవీంద్ర (నాని) మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడు బాధ్యత అని, 18 ఏళ్ళు నిండిన ప్రతియొక్క యువతి, యువకులు తప్పనిసరిగా ఓటును నమోదు చేసుకోవాలని, ప్రజలందరూ ఓటర్ లిస్ట్‌లో తమ పేర్లు సరిచూసుకోవాలని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తును, తమ భవిష్యత్తును ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకచారి, నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ , క్లస్టర్ ఇంచార్జిలు కసుకుర్తి హనుమంతరావు, ముత్తినేని రాజేష్, చింతకాయల రామారావు, మహిళ అధ్యక్షురాలు దాసరి జ్యోతి, డివిజన్ అధ్యక్షులు తెర్లగోర్ల అప్పారావు, దాసరి రమణ, మస్తాన్ వలి, మేలం సైదయ్య తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సూట్స్ కేర్ నెట్‌వర్క్‌తో చలపతి కళాశాల ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు : సూట్స్ కేర్ నెట్‌వర్క్‌తో చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మోతడక కాలేజ్ హెల్త్ పార్టనర్‌గా ఒప్పందం కుదుర్చుకోవటం చాలా సంతోషంగా ఉందని కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగారావు అన్నారు. వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను తెస్తూ అందరికి అందుబాటులో నాణ్యమైన వైద్యం తీసుకొనిరావటానికి సూట్స్ కేర్ నెట్‌వర్క్ కృషి చేస్తుందన్నారు. ఈ హెల్త్ పార్టనర్ భాగస్వామ్యంతో కాలేజ్ విద్యార్థులకు వైద్యపరమైన సేవలతో పాటు కాలేజీలో వైద్యపరమైన అవగాహన కార్యక్రమాల నిర్వహణ, నెలకు ఒకసారి మెడికల్ క్యాంప్ నిర్వహించటమే కాకుండా విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను సూట్స్ కేర్ నెట్‌వర్క్ అందిస్తుందని తెలిపారు. సూట్స్ కేర్ నెట్‌వర్క్ జనరల్ మేనేజర్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ఎటువంటి చిన్న ఇబ్బంది వచ్చినా వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవటం వలన భవిష్యత్తులో రాబోయే ఆరోగ్య పరమైన ఇబ్బందులను అధిగమించవచ్చని అన్నారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలతో హెల్త్ పార్టనర్‌గా ఒప్పడం కుదుర్చుకున్న సూట్స్ కేర్ నెట్‌వర్క్ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అఫడబుల్ హెల్త్ కేర్ తీసుకొని రావడానికి కృషి చేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వైస్ ప్రిన్సిపల్ నాగ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ వి.సుబ్బారావు, సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఏహెచ్‌సీ డైరెక్టర్ వెంకట్, రాజ్ కుమార్, గొల్లపల్లి లలిత్ ప్రజాపతి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ మండల అధ్యక్షుడుగా సైదులు

విశాలాంధ్ర-కారంపూడి: మండల విఆర్వోల సంఘ అధ్యక్షుడుగా పసుపులేటి సైదులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆరుముళ్ల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్దానిక రెవిన్యు కార్యాలయం నందు ఎన్నికలు నిర్వహించి అధ్యక్షుడుగా సైదులు ప్రకటించడం జరిగిందనారు. నూతనంగా గ్రామ రెవిన్యు సంఘ మండల అధ్యక్షుడుగా ఎన్నికైన సైదులు మాట్లాడుతు విఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను అధ్యక్షుడుగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు అభినందనలు తెలిపారు. గ్రామ రెవిన్యు అధికారుల సంఘ ఉపాధ్యక్షుడుగా ఎం హరిసింగ్‌నాయక్, కార్యదర్శి బి శివరామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎం కోటేశ్వరరావు, కోశాధికారి వై రోహిణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటిని తహశీల్దార్ జి శ్రీనివాస్, ఆర్ఐ కీర్తిసుధాస్రవంతి అభినందించారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు పలిశెట్టి వెంకటేశ్వర్లు, వి కోటేశ్వరరావు, జి వెంకటేష్, బండ్ల రామారావు, అబ్దుల్లా పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ సాదియాకు రోటరీ క్లబ్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మంగళగిరి : రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో యువజ నోత్సవాల సందర్భంగా మంగళగిరికి చెందిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా ఆల్మాస్‌కు ఆర్థిక సహాయం అందించారు. న్యూజిలాండ్‌లో జరగబోతున్న కామన్ వెల్త్ గేమ్స్‌లో ఎంపిక కాబడిన సాదియాకు, ఆ పోటీలలో పాల్గొనడానికి సుమారు రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని రోటరీ క్లబ్‌ను సహాయం కోరింది. మంగళగిరి రోటరీ క్లబ్ సౌజన్యంతో, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ మెంబర్ అయినటువంటి బిజిఆర్ గ్రానైట్స్ డైరెక్టర్ రొటేరియన్ కార్తీక్ రెడ్డి ఆ రూ.3 లక్షలని మంగళగిరి క్లబ్ ద్వారా పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మాస్‌కు బుధవారం అందజేయించారు. రోటరీ జిల్లా 3150 ట్రెనర్ రత్న ప్రభాకర్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు త్రిపురమల్లు సతీష్ బాబు, కోశాధికారి గాజుల శ్రీనివాసరావు, క్లబ్ ట్రైనర్ అనిల్ చక్రవర్తి పాల్గొని కామన్వెల్త్ పోటీలలో పాల్గొనబోతున్న సాదియా ఆల్మాస్ విజేతగా నిలవాలని స్వర్ణ పథకం గెలిచి మంగళగిరికి, రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తేవాలని శుభాకాంక్షలు తెలిపారు. సాదియా ఆల్మాస్ కూడా రూ.3 లక్షల స్పాన్సర్ చేసిన జీబీఆర్ మైన్స్ అండ్ గ్రానైట్స్ వారికి రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే ఎన్నికలలో కష్టపడి పనిచేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి పట్టణ పరిధిలోని దొంతి రెడ్డి అంజిరెడ్డి భవన్‌లో మాజీ వైసీపీ మండల అధ్యక్షులు దొంతి రెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పేద ప్రజలందరికీ 98 శాతం నవరత్నాలు సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. ప్రతి పేద ఇంటికి లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ది పొందుతున్నారని అన్నారు. ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో పెద్ద పెద్ద పరిశ్రమలు తీసుకురావడం రూ.16 వేల కోట్ల పరిశ్రమలు తీసుకొని రావడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఘనతేనని అన్నారు. సంక్షేమ పథకాలతో సీఎం జగన్ ముందుకు వెళుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మహాలక్ష్మి, వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ కేళి వెంకటేశ్వరరావు, గోరేబాబు, సింకా గంగాధర్ రావు, మాజీ ఎంపీటీసీ లుగోగుల శ్రీను, బుదాల బాబురావు, రంగస్వామి, సంజీవరెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు

విశాలాంధ్ర-గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, నవరత్న పథకాల ప్రభుత్వ సలహాదారు శామ్యూల్, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, నగరపాలక సంస్థ కమీషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారయణ శర్మతో కలసి బుధవారం సాయంత్రం నగర శివారులోని పొత్తూరు, ఏటుకూరు లే అవుట్లను పరిశీలించారు. పొత్తూరులో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. పొత్తూరు లేఅవుట్ నందు 625 గృహాలు మంజూరు అయ్యాయని, అందులో ఇప్పటి వరకు 16 ఇళ్ళు పూర్తి కాబడి లబ్దిదారులు గృహప్రవేశాలు కూడా చేయడం జరిగిందని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఎస్.సాయినాథ్ కుమార్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఏటుకూరు లే అవుట్ లో 6324 ఇళ్ళకు గాను 2036 ఇళ్ళ నిర్మాణాలకు మంజూరు ఉత్తర్వులు జారీ చేయబడి నిర్మాణ పనులు వివిధ దశలలో వున్నాయని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి తెలిపారు. ఇంటి నిర్మాణాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

రైతు సంతృప్తి పరిచే విధంగా రీసర్వే పనులు

విశాలాంధ్ర-శావల్యాపురం: రైతులు పూర్తి స్థాయిలో సంతృప్తి పరిచేలా, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపేలా రీసర్వే ఉండాలని డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే బాస్కర్ అన్నారు. మండలంలోని ఘంటావారిపాలెం గ్రామంలో జరుగుతున్న రిసర్వే పనులను తహశీల్దార్‌తో కలసి బుధవారం పరిశీలించారు. రీసర్వేపై పనులపై రైతులతో చర్చించి, రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసెర్వే పనులు ప్రతిగర్జన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రీ సర్వే జరిగే సమయంలో రైతులకు ముందు రోజు తెలియజేసి వారి సమక్షంలో హద్దులు నిర్ణయించాలని, అలాగే రోవర్ పరికరం అందుబాటులో లేని సమయంలో రీ సర్వే పనులు ఏవిధంగా చేయాలో సర్వే సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ జాన్ సైదులు, మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, విఆర్వోలు శ్రీనివాసరావు, సంతోష లక్ష్మీ, సచివాలయ సర్వేయర్లు తిరువాయిపాటి నరసింహసూరి, జవహర్ నాయక్, రైతులు ఉన్నారు.

దళితులపై పెరిగిపోతున్న దాడులు

విశాలాంధ్ర-శావల్యాపురం: రాష్ట్రంలో దళితులపై దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని శావల్యాపురం మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ మల్లాపరపు రాజశేఖర్ అన్నారు. బుధవారం కారుమంచి గ్రామాలలో విలేకరులతో మాట్లాడుతూ గత కొంతకాలంగా రాష్ట్రంలో జరిగిన హత్యలు, అత్యాచారాలు దాడులను గమనిస్తే ఎక్కువగా దళితులపైనే జరిగాయని వీటిపై ఒక్క కేసు కూడా నమోదు చేసి, న్యాయం వైపు అడుగు పడలేదని బాధితులకు న్యాయం జరగలేదని తెలిపారు. దళితులలో ఒక సామాజిక వర్గానికి మాత్రం రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ కమిషన్ కొమ్ముకాచి తక్షణమే న్యాయం చేసి పరిష్కారం కలిపిస్తుందన్నారు. మాదిగ సామాజిక వర్గంపై మాత్రం ప్రభుత్వం, ఎస్సీ కమిషన్ సవతి తల్లి ప్రేమ ప్రదర్శిస్తుందన్నారు. రాజ్యాంగంలోని చట్టాలకు అనుగుణంగా నడవవలసిన పోలీస్ శాఖ రాజకీయ ఒత్తిళ్లకు అలసత్వం వహిస్తుందన్నారు. దళితులకు అన్యాయం జరిగితే పోరాటం చేయడానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎప్పుడు ముందుంటుందని తెలిపారు.

వైసీపీ పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఖబరస్థాన్‌కి రెండె కరాల స్థలం తన సొంత నిధులతో కొనివ్వడానికి మూడున్నర సంవత్సరాలు పట్టింది. ఇక మిగిలిన మూడె కరాలు ఎప్పుడు కొనిస్తారో! ఆ దేవుడికే తెలియాలి... 2019 ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వస్తే రెండు ఎకరాలు సొంత నిధులతో ఖభరస్థాన్‌కి స్థలం కొనిచ్చి, మిగిలిన మూడు ఎకరాలు ప్రభుత్వ నిధులతో మంజూరు చేయిస్తానని మంత్రి విడదల రజిని హామీ ఇచ్చారని టీడీపీకి చెందిన ముస్లిం నాయకులు ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సొంత నిధులతో కొనివ్వడానికే ఇంత సమయం తీసుకుంటే ప్రభుత్వ నిధులతో మిగిలిన మూడెకరాలు కొనివ్వడానికి మంత్రి విడదల రజనీ ఇంకా ఎంత సమయం తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. అభినందన సభలో మంత్రి భజన, పుల్లారావుపై విమర్శలు చేయటానికి పరిమితమైందన్నారు. మంత్రి కొనిచ్చిన స్థలం అంజుమన్ కమిటీకి రిజిస్టర్ చేశారా...? లేక వ్యక్తిగతంగా ఎవరి పేరుతోనైనా రిజిస్టర్ చేశారా...? ఎవరి పేరుతో రిజిస్టర్ చేశారో వివరాలు తెలియపరచాలని కోరారు. మంత్రిగా ప్రత్తిపాటి చిలకలూరిపేట నియోజకవర్గంలో ఉన్న ఖబర్‌స్థాన్‌లు అన్నిటికీ లక్షల రూపాయలు ఖర్చుతో రిపేర్లు చేయించారు. గుర్రాలు చావిడిలో ఉన్న ఖభరస్థాన్‌కి రూ.58 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని వెల్లడించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి పఠాన్ సమద్ ఖాన్, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి జరీనా సుల్తానా, చిలకలూరిపేట నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జానీ బాష, చిలకలూరిపేట పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ అల్లాభక్షు(స్వాతి డిజిటల్), షేక్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

170 మందికి కంటి వైద్య పరీక్షలు



విశాలాంధ్ర-విజయపురిసౌత్ : నాగార్జునసాగర్, విజయపురిసౌత్ లోని ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో భవ్యహెల్త్ సర్వీసెస్, మీనాక్షి కంటి ఆసుపత్రి వారు సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం స్థానిక జెన్‌కో క్వాటర్స్ వద్ద నిర్వహించారు. నేత్ర వైద్యులు ఉషా భవాని, వినయ్‌ల ఆధ్వర్యంలో 170 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. 25 మందిని రిఫర్ చేశారు. ఈ సందర్భంగా జెన్‌కో ఈవైఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఈ శిబిరంలో కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం శుభపరిణామమని అన్నారు. గిరిజన ప్రాంతాలకు చెందిన ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు వెచ్చించి కంటి పరీక్షలు చేసుకోవడం కష్టమవుతుందని, దానిని దృష్టిలో పెట్టుకొని ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. జెన్‌కో డీఈ జి.రాజారెడ్డి మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానమని మన పెద్దలు కంటి ప్రాముఖ్యతను చెప్పారని, అటువంటి నేత్రాలను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కె.రేవతి, భవ్య అడ్మినిస్ట్రేటర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అపరాల సమగ్ర పంట యాజమాన్యంపై అవగాహన

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు మండలం ములుకుదురు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఏరువాక కేంద్ర లాం గుంటూరు వారి ఆధ్వర్యంలో అపరాల సమగ్ర పంట యాజమాన్యం ఒకరోజు అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడుతూ బీడు భూములలో అపరాల పంటను వేయరాదని మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేయాలన్నారు. అపరాలలో కలుపు యాజమాన్యం గురించి వివరించారు. మరో వ్యవసాయాధికారి డాక్టర్ శ్రీలత వాణి మాట్లాడుతూ మినుము, పెసరలో వచ్చు తెగుళ్ల పురుగులు వాటిని నివారించే పద్ధతులను వివరించారు. గ్రామంలో వైయస్సార్ పొలంబడి క్షేత్ర దినోత్సవం జరిపారు.

పన్నుల బాదుడుతో ప్రతి ఇంటి నుంచి లక్ష దోచుకుంటున్న జగన్ రెడ్డి

విశాలాంధ్ర-వినుకొండ : వివిధ రకాల పన్నులు విధించి రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుంచి లక్ష రూపాయలు జగన్ రెడ్డి ప్రభుత్వం దోచుకుంటుందని, ఇటువంటి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు తరిమికొట్టాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని రెడ్డినగర్ 31వ వార్డులో బుధవారం రాత్రి పట్టణ పార్టీ అధ్యక్షతన బాదుడే-బాదుడు కార్యక్రమం నిర్వహించగా ఆంజనేయులు హాజరై ఇంటింటికి తిరిగి వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం వార్డు ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి దోచుకోవటం దాచుకోవటమే తప్ప రాష్ట్రంలో అభివృద్ధి ఊసే లేదని దుయ్యబట్టారు. నిత్యవసరాల ధరలు పెరిగి పేదవాడి జీవనం కష్టతరంగా మారితే ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆర్టీసీ, విద్యుత్తు చార్జీలతో పాటు చెత్త పన్ను, ఇంటి పన్ను తదితర పన్నుల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నాడని విమర్శించారు. కరెంటు బిల్లులు అధికమంటూ అమ్మఒడి లాంటి పథకాలు అర్హులను తొలగించడం, పెన్షన్లలో కోతలు విధిస్తూ రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగిస్తున్నాడని అన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వ్యక్తిగత స్వార్థం కోసం పట్టణ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నాడని అన్నారు. వినుకొండ కొండ చుట్టూ చౌకగా భూములు సొంతం చేసుకొని వాటి విలువలు పెంచుకునేందుకు ఘాట్ రోడ్డు, గిరి ప్రదర్శన రోడ్డు అంటూ మున్సిపాలిటీ నిధులను తరలించుకుంటూ వార్డుల్లో సమస్యలను గాలికి వదిలేసారన్నారు. అధికారం అడ్డం పెట్టుకొని వినుకొండలో పొలిటికల్ రియల్ ఎస్టేట్ చేస్తూ అక్రమంగా వందల కోట్లు సొంతం చేసుకున్నాడని అన్నారు. పట్టణంలోని 5 వేల మంది పేద ప్రజలకు తీరని అన్యాయం చేశాడని, ప్రభుత్వ భూమిని ప్రభుత్వానికే అమ్మి కోట్లు కాజేసి హైవే పక్కన 100 ఎకరాలు ప్రజాధనంతో కొనుగోలు చేసి మోసం చేశాడని వివరించారు. కార్యక్రమంలో పట్టణంలోని 31వ వార్డు బోడపాటి రామారావు, బూత్ కన్వీనర్ నరసింహారావు, వాసిరెడ్డి హనుమంతరావు, వెంకట్రావు, షమిం ఖాన్, సౌదాగర్ జానీ భాష, పల్ల మీసాల దాసయ్య, పత్తి పూర్ణచంద్రరావు, ఆయిబ్ ఖాన్, అజీజ్, యూత్ జానీ, కాశి, గోల్డ్ కరీముల్ల, వంకాయలపాటి పేరయ్య, సోమేపల్లి బ్రహ్మయ్య, గంగినేని రాఘవ, గన్నమనేని వెంకయ్య, గోరంట్ల హనుమంతరావు, దాసరి కోటేశ్వరావు, మీసాల మురళి, బత్తుల గోవిందరాజులు, పులి నాగరాజు, ముప్పూరి చౌడమ్మ, మన్యం ఆదిలక్ష్మి, బొట్లగుంట లక్ష్మి, నక్కా వీరా రెడీ తదితరులు పాల్గొన్నారు.

మతుకుమల్లిలో సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో నెలకొనియున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ని పలువురు గ్రామస్తులు కలిసి బుధవారం వినతిపత్రాలను అందజేశారు. గ్రామంలోని త్రాగునీటి పథకం వద్ద ఇసుక మార్చక నీరు శుద్ధి కావడం లేదని, కెనాల్ నుండి వచ్చిన కలుషిత నీటిని గ్రామంలోకి వదులుతున్నారని టీడీపీ నాయకులు ముండ్రు హనుమంతరావు, చింతా గంగయ్య జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పంచాయతీ నిధులను మౌళిక వసతులకు ఎందుకు వాడడం లేదని కలెక్టర్ పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. త్రాగునీటి పథకాన్ని బాగు చేయించి వెంటనే గ్రామంలోకి స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. గ్రామంలో నుండి కోతిస్వామి గుడి మీదుగా వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వరకు రోడ్డు, విధ్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, శావల్యాపురం వెళ్ళే మార్గంలో రైల్వేగేటుతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ ముండ్రు హనుమంతరావు కోరారు. మతుకుమల్లిలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, పొలాలకు వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా మారాయని పల్నాడు జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య కలెక్టర్‌కి విన్నవించారు. మండలంలోని 11 గ్రామసచివాలయాలకు నలుగురు కార్యదర్శులు మాత్రమే ఉన్నారని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కార్యదర్శులు లేని చోట్ల వెల్ఫేర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించేలా చర్యలు చేపడతానని అన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి వెంటనే ఆరోగ్య ఉపకేంద్రాన్ని పడగొట్టి పాఠశాలలో ఆటస్థలాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలకు వెనుక భాగాన్ని ఆనుకొని గేదెలను కట్టేయడం వలన దుర్వాసన రావడంతో స్పందించిన కలెక్టర్ పాఠశాల ప్రాంగణము చుట్టుపక్కల పశువులను మేపకుండా, పరిశుభ్రంగా ఉండేలా పశువుల యజమానులకు అవగాహన కల్పించాలని కార్యదర్శిని ఆదేశించారు. పాఠశాల స్థలం వరకు వెంటనే ప్రహరీగోడను నిర్మాణం చేపట్టాలని, పాఠశాల వెనుక గ్రావెల్ రోడ్డు వేయాలని అధికారులకు తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సంక్షేమ పథకాల జాబితాలు పరిశీలించి చెత్తసేకరణ కేంద్రం వద్ద వర్మి కంపోస్ట్ తయారీపై ఆరా తీశారు. ఎస్సీ కాలనీకి చెందిన 26 మందికి తక్షణమే ఇంటి పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని, స్మశాన వాటికకు సంబంధించి ఆర్ఎస్ఆర్ ప్రకారం ఎంత మేరకు పరిధి ఉన్నదో గుర్తించి తదనగుణంగా ప్రహరీ గోడ నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తహసీల్దార్ జాన్ సైదులు, ఎంపీడీవో సీతారామయ్య, ఏపీఎం వాసుబాబు, ఏపీవో రాజు, ఆర్ఎస్ఐ నాసరయ్య, పంచాయతీ కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన ఊరుని.. చదువుకున్న స్కూల్‌ని మరువకూడదు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : పుట్టిన ఊరుని, చదువుకున్న స్కూల్‌ని, విద్య నేర్పిన గురువుని ఏనాటికి మరవకూడదని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అర్తిమళ్ల రమేష్ అన్నారు. బుధవారం ఆయన జన్మదిన వేడుకలు పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. క్రికెట్ క్రీడాకారులకు టీ షర్టు, షాట్లు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు ఉన్నత శిఖరాలకు ఎదిగి మనం చదువుకున్న పాఠశాలను మర్చిపోతున్నామని, అలా మరవకుండా మనం చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి సహకరించి పూర్వ విద్యార్థిగా మరి కొంత మందికి ఆదర్శంగా నిలవాలని రమేష్ అన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ముంతాజ్ అజుముల్లా, భాష్యం ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, నెల్లూరు మల్లికార్జునరావు, మక్కెన సాగర్, కృష్ణకుమారి, నూతక్కి ఈశ్వరి, తాళ్లూరు వీర వసంతరావు, కంచర్ల సుధాకర్, పాటిబండ్ల బాలయ్య, మద్ది రాధ, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న కలెక్టర్ బంగ్లాను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లా నరసరావుపేటలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్న కలెక్టర్ బంగ్లాను జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం పరిశీలించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాటి కలెక్టర్ పెద్ద చెరువు బైపాస్ రోడ్డులో ఉన్నా ప్రభుత్వ భవనంను నూతనంగా ఏర్పాటు అయిన పల్నాడు జిల్లా కలెక్టర్ బంగ్లా, క్యాంప్ కార్యాలయానికి కేటాయించారు. మరమ్మతు పనులను రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేశారు. సదరు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనులపై పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఇంజనీర్ రాజా నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర, మండల రెవెన్యూ అధికారి రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట వాగ్గేయకారుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు : సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు సంగీత ప్రపంచంలో తనదైన శైలిలో రసజ్ఞులను ఉర్రూతలూగించిన విశిష్ట వాగ్గేయకారుడు, మహత్తర సంగీతఝరి మంగళంపల్లి బాలమురళీకృష్ణ అని అవగాహన మనమూ పాడుదాం! రండి! బృంద సభ్యులు నివాళులర్పించారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ వర్ధంతి కార్యక్రమం జరిగింది. తొలుత బాలమురళీకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీమాంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ పీఎస్ మూర్తి మాట్లాడుతూ కర్ణాటక సంగీత ప్రపంచంలో మహోన్నతుడు, మధుర గాన సరస్వతి, అపర త్యాగరాజుగా డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణను ఆయన అభిమానులు వేనోళ్ళ కీర్తిస్తారన్నారు. బాలమురళీకృష్ణ గొప్ప గాయకుడు, సంగీత శ్రేష్ఠ, వాద్యకారుడు, నటుడు, స్వరకర్త సాహితీవేత్త సంగీత దర్శకుడిగా దేశ ప్రజలందరి ప్రశంసలు పొందారన్నారు. సినీరంగ విశ్లేషకులు ఎ.అమరాచారి మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో బాలమురళి అందుకోని అవార్డులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డులతో సత్కరించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 25 వేల పైచిలుకు సంగీత కచేరీలు నిర్వహించి కర్ణాటక సంగీతాన్ని ప్రపంచ స్థాయికి తీసుకొచ్చాడన్నారు. జుగల్బంది తరహా కచేరీలకు బాలమురళీకృష్ణ రూపకల్పన చేశాడని అన్నారు. గాయకులు కె.జయకుమార్, సంపత్, రాజశేఖర్, కమల కుమారిలు, బాలమురళీ గేయాలను ఆలపించారు.

25న సూపర్‌స్టార్ కృష్ణ సంస్మరణ సభ

విశాలాంధ్ర-తెనాలి : పద్మభూషణ్, నటశేఖర్, సూపర్‌స్టార్ కృష్ణ సంస్మరణ సభ ఈనెల 25వ తేది సాయంత్రం 5.30గంటలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరుగుతుందని కళల కాణాచి ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు తెలిపారు. బుధవారం తెనాలి సిపిఐ కార్యాలయంలో పత్రికా విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. సభకు సీనియర్ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్, ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వేద గంగోత్రి ఫౌండేషన్ విజయవాడ ఛైర్మన్ జి.వి.ఎన్.ఆర్. ఎస్ఎస్ వరప్రసాద్, సినీ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఈదర వెంకట పూర్ణచంద్, వ్యాపార వేత్త జాలాది రవికుమార్, తాడిబోయిన హరిప్రసాద్‌లు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమ కార్డును సింగారావు, భీమేశ్వరప్రసాద్, భవాని, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు. సైదా ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో కృష్ణ గానామృతం జరుగుతుందని తెలిపారు.

ఉచిత దృష్టి, నేత్ర యోగ చికిత్స శిబిరం

విశాలాంధ్ర-గుంటూరు : దృష్టి, నేత్ర సంబంధ అన్ని రకముల దీర్ఘకాలిక దృష్టి, చూపు దోషాలకు ఈ నెల 25వ తేదీ నుంచి 45 రోజులపాటు శాస్త్రబద్ధమైన యోగ, థెరపీ, చికిత్స విధానాలతో పూర్తిస్థాయి ఉచిత శిక్షణ శిబిరం స్థానిక అరండల్ పేట విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు హఠ యోగి పులివర్తి కేశవ విశ్వకర్మ పేర్కొన్నారు. స్థానిక ఆర్.అగ్రహారం, బండల బజారు, 'అహింస భారతీయ యోగ విశ్వవిద్యాలయం' ఆవరణలో కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ యోగ సాధనతో పాటు ప్రత్యేక థెరపీల ద్వారా గత 36 సంవత్సరాల నుంచి ఇప్పటివరకు 400 మందికిపైగా లబ్ధిపొందారని చెప్పారు. కంటికి సంబంధించిన రుద్దటాలు, నలపటాలు, మసాజ్ చేయటం వంటివి కాకుండా ఏ మందులు వాడకుండా కన్ను, కన్ను నరములు, మెదడులోని కంటి కేంద్రములకు సంబంధించిన అన్ని సమస్యలకు పూర్తి పరిష్కారం 40 రోజుల శిబిరం ద్వారా నూరు శాతం ఫలితాలు పొందవచ్చునని తెలియజేశారు. వివరాలకు 83319 32920, 996393 1916 నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు. కరపత్రాల ఆవిష్కరణలో డాక్టర్ కె.కొండయ్య, గురుప్రసాద్, సీహెచ్ ఏడుకొండలు, ఎం.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

విశాలాంధ్ర-మాచర్ల : స్థానిక శ్రీ సత్యసాయి విద్యా విహార్ పాఠశాలలో బుధవారం సత్యసాయి సేవాసమితి, సాయి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 97వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అభయ ఫౌండేషన్ నిర్వాహకులు బాలచంద్ర, న్యూటన్స్ విద్యాసంస్థల చైర్మన్ జున్నా శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ముందుగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జున్నా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మానవ రూపంలో కనిపించిన దైవాంశ సంభూతుడని అన్నారు. పట్టణంలో సత్యసాయి సేవా సమితిని ప్రారంభించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులను గుర్తించి వారికి ఉచిత విద్యను ఆంగ్లంలో బోధించడంతోపాటు విద్యార్థులకు వేదం, భరతనాట్యం, యోగ, మ్యూజిక్, కరాటే లాంటివి నేర్పించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా జొన్న శ్రీనివాసరెడ్డి, బాలచంద్రలను సత్యసాయి సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సుమారు 2000 మందికి అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాచర్ల మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాళంగి నాగేశ్వరరావు, సత్యసాయి విద్యా విహార్ కన్వీనర్ అక్కినేని అనిల్ కుమార్, జక్కా శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.